సాక్షి కర్నూలు

సోమవారం | 21 | ఏప్రిల్ | 2025



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళా వేదికపై ఆదివారం హైదరాబాద్‌కు చెందిన వేరబోట్ల ఆశ్రిత, బృందం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలం టెంపుల్: భ్రామరీ సమేత మల్లికార్జున స్వామికి ఆదివారం శాస్త్రోక్తంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



డాక్టర్ దగ్గరకు వెళ్లాల్సిందే!

ఇక నుంచి నేరుగా మెడికల్ దుకాణానికి వెళ్లి మందులు ఇవ్వాలని కోరితే కుదరదు. వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా మందులు ఇస్తే లైసెన్స్ రద్దు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



క్యూ లైన్లలో వేచివున్న భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మ వార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేకువజామున పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి ఆలయ క్యూ లైన్లలో బారులు తీరారు. క్యూ లైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, అల్పాహారం, బిస్కెట్స్ దేవస్థాన అధికారులు పంపిణీ చేశారు. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులు కళకళలాడుతున్నాయి.

గాలులు, మెరుపులతో వాన

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలుచోట్ల ఆదివారం సాయంత్రం గాలులు, మెరుపులతో వర్షం కురిసింది. జూపాడుబంగ్లా మండలంలో 33.75, పాములపాడు మండలంలో 28.5, వెల్దుర్తి మండలంలో 21.0, నందికొట్కూరులో 16.5, గూడూరులో 13.5 మి.మీ ప్రకారం వర్షపాతం నమోదైంది. కర్నూలు నగరంలో సాయంత్రానికి ఒక మోస్తరు వర్షం పడటంతో వాతావరణం చల్లబడింది. పెనుగాలుల తీవ్రతకు పలుచోట్ల తోటల్లోని మామిడి చెట్లు నేలమట్టమయ్యాయి. మామిడి రైతుకు నష్టం వాటిల్లింది.

ఇద్దరు ఏఈలకు పదోన్నతి

కోడుమూరు రూరల్: గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాల్వ ఏఈగా పనిచేస్తున్న నారాయణ, ఎల్ఎల్‌సీ కోడుమూరు సబ్ డివిజన్ ఏఈగా పనిచేస్తున్న మోహన్‌రావులకు ఆదివారం డీఈఈలుగా పదోన్నతి లభించింది. జీడీపీ ఎడమ కాల్వ ఏఈ నారాయణ డీఈఈగా పదోన్నతిపై వైఎస్సార్ జిల్లాకు వెళ్లగా, ఎల్ఎల్‌సీ కోడుమూరు సబ్ డివిజన్ ఏఈ మోహన్‌రావును అనంతపురం హెచ్ఎల్‌సీ కెనాల్ డీఈఈగా నియమిస్తూ ఉన్నతాధికారులు లేఖ విడుదల చేశారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసు అధికారులు

కర్నూలు (టౌన్): నేర ప్రవృత్తికి స్వస్తి పలికి ప్రశాంత జీవనం గడపాలని రౌటీషీటర్లకు పోలీసు అధికారులు సూచించారు. నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో రౌడీషీటర్లకు, నేర చరిత్ర ఉన్న వారికి ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మామయ్య దీవెనలు.. మంచి మార్కులు

చదువుతో పేదరికాన్ని దూరం చేసేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణలు తీసు కొచ్చింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలను కార్పొరేట్ కాలేజీలకు దీటుగా తీర్చిదిద్దింది. డిజిటల్ విద్యను అందించేందుకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ అందించింది. ప్రతి ఇంట్లో ఒక ఇంజినీరు, ఒక డాక్టర్ ఉండాలనేది మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యం. మామయ్య దీవెనలతో అక్కడ చదివిన పేదింటి విద్యార్థులు ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించారు. ఇదంతా గత ప్రభుత్వ చలువే అని తల్లిదండ్రులు, విద్యార్థులు చెబుతున్నారు.



- ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు అన్ని సౌకర్యాలు కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- జిల్లాలో రూ.17.62 కోట్లతో మౌలిక సదుపాయాలు
- కేజీబీవీల్లో ఇంటర్ విద్యను ప్రవేశ పెట్టిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- అప్పట్లోనే ప్రభుత్వ స్కూళ్లలో వృత్తి, కంప్యూటర్, డిజిటల్ విద్య అమలు
- ఇంటర్‌లో ప్రతిభ చాటిన పేదింటి విద్యార్థులు

కర్నూలు సిటీ/సాక్షి నెట్‌వర్క్: పేదింట్లో విద్యా దీపాలు వెలిగించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంది. మనబడి నాడు–నేడు, అమ్మఒడి, వసతి, విద్యా దీవెన తదితర పథకాలు పకడ్బందీగా అమలు చేసింది. దశాబ్దాలుగా ఎలాంటి సౌకర్యాలు లేక దాదాపు మూతపడే ప్రభుత్వ విద్యాసంస్థలు సైతం కొత్త రూపును దిద్దుకున్నాయి. అక్షరాన్ని కాసులు పెట్టి కొనుక్కోనే స్తోమత లేని ఎంతో మంది పేదలు నేడు ఉన్నత చదువులు చదువుతున్నారు. అదంతా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన పథకాలే అని తల్లిదండ్రులు, విద్యార్థులు చెబుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం ప్రవేశ పెట్టిన తరువాత పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు సత్తా చాటారు. వారే ఇప్పుడు ఇంటర్‌లోనూ మంచి మార్కులు తెచ్చుకున్నారు. ప్రభుత్వ జూనియర్, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూళ్లలో వచ్చిన అత్యుత్తమ ఫలితాలే ఇందుకు నిదర్శనంగా నిలిచాయి.

ఇవీ ఫలితాలు..

- 2018లో ఒక్క తుగ్గలి కేజీబీవీలో మాత్రమే ఇంటర్ విద్యను ఉండేది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని కేజీబీవీల్లో ఇంటర్ విద్యను ప్రవేశ పెట్టి పీజీటీ పోస్టులను భర్తీ చేసింది.
- నేడు నాలుగు కేజీబీవీలు ఇంటర్ ఫస్టియర్‌లో వంద శాతం ఫలితాల్లో సాధించాయి. అలాగే ఏడు కేజీబీవీలు ఇంటర్ సెకండ్ ఇయర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి.
- పంచలింగాల కేజీబీవీ విద్యార్థులు అకౌంట్స్ అండ్ టాక్సెషన్‌లో 1000 మార్కులకు 992, 991, 981 మార్కులు సాధించారు. రాష్ట్ర స్థాయిలో మొదటి మూడు అత్యధిక మార్కులు సాధించి విద్యార్థులు వీరే కావడం ఈ విద్యాలయం ప్రత్యేకత.
- గూడూరు కేజీబీవీ విద్యార్థి ఎంపీసీలో 983 మార్కులు, అలాగే మరో విద్యార్థి బైపీసీలో 966 మార్కులు సాధించారు.
- కర్నూలు టౌన్ మోడల్ కాలేజీకి చెందిన ఓ ఆటో డ్రైవర్ కుమార్తె ఎంపీసీలో 986 మార్కులు సాధించారు.
- ఎమ్మిగనూరు పట్టణంలోని బాలుర కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో అరవింద్ 955 మార్కులు, సాయి ప్రసాద్ 935మార్కులు, మణికుమార్ బైపీసీలో 946, చరణ్ 902 మార్కులు సాధించారు. అదే విధంగా సీఈసీ, హెచ్ఈసీ, సీపీ అండ్ ఎం కోర్స్‌లో ఆరుగురు విద్యార్థులు, బాలికల ప్రభుత్వ కళాశాలలో ఎనిమిది మంది విద్యార్థినులు అత్యధిక మార్కులు సాధించారు.



అత్యధిక మార్కులు సాధించిన ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులతో అధ్యాపకులు (ఫైల్)

వైఎస్సార్‌సీపీ హయాంలో చేపట్టిన పనులు ఇవే..

- గ్రామీణ ప్రాంతాల్లో బాలికల అక్షరాస్యత శాతం పెంచేందుకు 26 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఇంటర్మీడియేట్ విద్యను ప్రవేశ పెట్టారు.
- 20 కేజీబీవీల్లో నాడు–నేడు కింద రూ.96 లక్షలతో పనులు చేపట్టారు.
- కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 6 నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో విద్యను అందిస్తున్నారు.
- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నాడు–నేడు ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించారు. మరుగుదొడ్లు, తాగు నీటి సదుపాయాలకు రూ.17 కోట్లతో పనులు చేపట్టారు.
- ప్రతి జూనియర్ కాలేజీలో డిజిటల్ విద్యను అందించేందురకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ అందించారు.
- పేదలు చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు రాకూడనే ఉద్దేశంతో అమ్మఒడి, వసతి, విద్యా దీవెనల ద్వారా నాలుగేళ్ల పాటు ఆర్థిక సహాయాన్ని అందించారు.

విద్యాసంస్థలు	సంఖ్య
ప్రభుత్వ జూనియర్ కాలేజీలు	23
కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలు	26
ఏపీ మోడల్ స్కూళ్లు	16
రెసిడెన్షియల్, పూలే, సోషల్ వెల్ఫేర్ కాలేజీలు	08

గత ప్రభుత్వ చలువే



అనంతపురం జిల్లా పామిడికి చెందిన శ్రీనివాసులు, రమబాయిల కుమార్తె ఎం. ధృతికబాయి ఇంటర్ సెకండ్ ఇయర్ ఎంపీసీలో 987 మార్కులు సాధించారు. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవటం తల్లిదండ్రులు ప్రైవేట్ కాలేజీల్లో ఫీజులు చెల్లించలేక బనవాసి ఏపీఆర్‌జేసీ కాలేజీలో చేర్పించారు. గత ప్రభుత్వం విద్యా రంగంలో తీసుకువచ్చిన మార్పులు, విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించటంతో మెరుగైన విద్యను అందించారు. ఏపీఆర్‌జేసీ కాలేజీలో నాణ్యమైన విద్యనందించటంతో తమ బిడ్డ మంచి మార్కులు సాధించారని తల్లిదండ్రులు శ్రీనివాసులు, రమబాయిలు చెపుతున్నారు.

హాస్టల్‌లో చదువుకుని..



ఆదోని మండలం నాగథనహళ్లి గ్రామానికి చెందిన రాఘవేంద్ర.. క్రాప్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్ మెంట్ కోర్స్‌లో 958 మార్కులు సాధించి రాష్ట్ర ప్రథమంలో నిలిచారు. గత మంగళవారం విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ చేతుల మీదుగా ప్రతిభా అవార్డు అందుకున్నాడు. ఈ విద్యార్థి ఎమ్మిగనూరు ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో ఉండి స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో చదివారు. పదేళ్ల క్రితం తండ్రి మాల తిక్కయ్యను కోల్పోయిన ఈ విద్యార్థిని తల్లి ఆసనమ్మ కూలి పనులు చేసి చదివించింది. ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఇంటర్‌లో మంచి మార్కులు సాధించానని ఈ విద్యార్థి తెలిపారు. బీఎస్సీ అగ్రికల్చర్ కోర్స్ చేసి వ్యవసాయ శాఖలో మంచి ఉద్యోగం సాధించి రైతులకు చేయూతనందించాలన్నదే తన లక్ష్యమని చెప్పారు.

తల్లిదండ్రులకు అండగా నిలుస్తా



అనంతపురం జిల్లా పెద్ద పప్పూరు గ్రామానికి చెందిన వెన్నపూస రామ్మోహన్‌రెడ్డి, లక్ష్మీదేవిల కుమార్తె వి. వైష్ణవి ఏపీఆర్‌జేసీ బనవాసిలో చదివి ఎంఈసీలో 979 మార్కులు సాధించారు. రాష్ట్రస్థాయిలో మంచి మార్కులు సాధించి ప్రశంసలతో పాటు ప్రతిభ పురస్కారాన్ని అందుకున్నారు. బనవాసి ఏపీఆర్‌జేసీ కాలేజీలో విద్యార్థిని రాష్ట్రస్థాయిలో మంచి మార్కులు సాధించటం గత ప్రభుత్వం విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించటమే కారణమని తెలుస్తోంది. మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు అండగా నిలవాలని ఉందని విద్యార్థిని వి. వైష్ణవి చెప్పారు.

గర్వంగా ఉంది



గూడూరు మండలం వై.ఖానాపురం గ్రామానికి చెందిన దంపతులు ఉప్పరి ఆనంద్, లక్ష్మీల కుమార్తె ఉప్పరి సునీత గూడూరులోని కేజీబీవీలో చదివారు. ఇంటర్ ఎంపీసీ సెకండ్ ఇయర్ ఫలితాల్లో 983 మార్కులు సాధించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా సత్కారాన్ని అందుకున్నారు. ఈ విషయంపై తండ్రి ఆనంద్ మాట్లాడుతూ.. తాము పేదవాళ్లమైనప్పటికీ తమ పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ అద్భుతమైన మార్కులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. తమ కుమార్తె సునీత 6వతరగతి నుంచి గూడూరు కేజీబీవీలో విద్యనభ్యసిస్తూ ఇంటర్‌లో మంచి మార్కులు సాధించడం తమకెంతో గర్వంగా ఉందన్నారు. అన్ని అనుకూలిస్తే తన కుమార్తెను ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చేయాలన్నదే తన లక్ష్యమని తండ్రి ఆనంద్ తెలిపారు.

పేద ఇంట విద్యా దీపం



కర్నూలు మండలం ఆర్.కొంతలపాడు గ్రామానికి చెందిన తెలుగు మహేష్, సువర్ణమ్మలకు రెండెకరాల భూమి మాత్రమే ఉంది. ఉన్న కాస్త భూమిలో పంటలు పడించడంతో పాటు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె మానస పంచాలింగాల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ఒకేషనల్ (అకౌంట్స్ ట్యాక్సేషన్) సెకండియర్‌లో 992మార్కులు సాధించారు. విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. విద్యార్థిని మానస మాట్లాడుతూ.. తనను చదివించాడనికి తల్లిదండ్రులు ఎంతో పెద్ద కష్టపడ్డారని, ఉపాధ్యాయులు కూడా ఎంతగానో ప్రోత్సహించారన్నారు. తాను ఐఏఎస్ అయ్యి మారుమూల గ్రామాల్లోని పిల్లలకు చదువు అందించేందుకు కృషి చేస్తానని మానస తెలియజేశారు.

జగన్ మామయ్య చేసిన మార్పులతోనే..



కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామానికి చెందిన బోయ స్వాములు, వరలక్ష్మి దంపతుల కుమార్తె బోయ హరిత ఓర్వకల్లు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో చదివారు. ఇంటర్ ఎంఈసీ గ్రూపులో 913 మార్కులు సాధించారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. తాను వ్యవసాయ కుటుంబంలో పుట్టి, ఇంట్లో పనులు, పొలం పనులు చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా నిలిచానని ఈ విద్యార్థిని తెలిపారు. ఊర్లో జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదివి మంచి మార్కులు సాధించానని, ఇంటర్‌లో 913 మార్కులు సాధించడం చాలా గర్వంగా ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మామయ్య ప్రభుత్వ విద్యలో మార్పులు చేసి ఆయన ప్రవేశపెట్టిన 'బేబీ బుల్లెట్స్' అనే పుస్తకం నా చదువుకు ఎంతగానో ఉపకరించిందని ఈ విద్యార్థిని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



కర్నూలు నగరంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

జిల్లాలో ఈస్టర్ వేడుకలను ఆదివారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పండుగ ప్రాముఖ్యతను మతపెద్దలు వివరించారు. పాపులను రక్షించడం గుడ్‌ఫ్రైడే సందేశమైతే, సత్యాన్ని అంతం చేయాలన్న ప్రతిసారీ ఏదో రూపంలో జన్మిస్తూనే ఉంటుందన్నది ఈస్టర్ నేర్పిన పాఠమని పేర్కొన్నారు. యేసుక్రీస్తు బోధనలను విశ్వసించి సన్మార్గంలో నడువాలని సూచించారు. -కర్నూలు టౌన్

అమరావతి పేరుతో రూ. వేల కోట్ల దోపిడీ!

- లక్ష ఎకరాల్లో ఎక్కడైనా రాజధాని నిర్మించారా?
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి. చిత్రంలో మేయర్ బీవై రామయ్య, తెర్నేకల్ సురేందర్ రెడ్డి తదితరులు

కర్నూలు (టౌన్): '' ప్రపంచంలో ఎక్కడైనా లక్ష ఎకరాల్లో రాజధాని నిర్మించారా? కేవలం అమరావతి పేరు చెప్పి రూ. వేల కోట్ల దోపిడీ చేస్తుంది నిజం కాదా'' అని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి ప్రశ్నించారు. కర్నూలులోని ఎస్వీ కాంప్లెక్స్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. ఏపీ అంటే ఆంధ్రప్రదేశ్ అని అందరికీ తెలుసని, అయితే సీఎం చంద్రబాబు నాయుడు మాత్రం ఏపీని అమరావతి, పోలవరంగా మార్చారన్నారు. రాష్ట్రంలో 'కూటమి' ప్రభుత్వం వచ్చి 11 నెలలు అవుతున్నా ఒక్క అమరావతి తప్ప మిగతా వెనుకబడిన 12 ఉమ్మడి జిల్లాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికే రూ. 1.60 లక్షల కోట్ల అప్పులు చేసి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని విమర్శించారు. అమరావతిలో రూ. 40 వేల కోట్ల పనులకు సంబంధించి ఇప్పటికే మొబలైజేషన్ పేరుతో 10 శాతం నిధులు కమీషన్ల పేరుతో కూటమి నేతలు కొట్టేశారని ఆరోపించారు. తాజాగా 52 వేల ఎకరాల భూసేకరణ చేయడం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునేందుకు, వారి అనుయాయులకు రూ. కోట్లు కట్టబెట్టేందుకే అని ఆరోపించారు. ఒక కిలోమీటరు రోడ్డుకు అమరావతిలో రూ.60 కోట్లు ఖర్చు చేస్తున్నారని, 7.29 కిలోమీటర్ల రోడ్డు పనులకు రూ.460 కోట్లు టెండర్లు పిలిచారన్నారు. అమెరికా దేశంలోని వైట్ హౌస్ వద్ద ఈ రోడ్డు వేసిన అంత ఖర్చు కాదన్నారు. పార్లమెంటుకు రూ.971 కోట్లు ఖర్చు చేశారని, అదే మన అమరావతిలో అసెంబ్లీ నిర్మాణం కోసం రూ.750 కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. జ్యుడీషియల్ టెండర్ల విధానం ఎత్తేసి రూ. 4 వేల కోట్లు కమీషన్లను దండుకుంటున్నారని ఆరోపించారు. అమరావతి నిర్మాణం పేరుతో జరుగుతున్న అవినీతి కుంభకోణాలను రాబోయే రోజుల్లో వెలుగులోకి తీసుకువస్తామన్నారు.

హైకోర్టు బెంచీ ఏదీ?

కర్నూలుకు ఏడాది నుంచి హైకోర్టు కాదు కదా బెంచీ కూడా తీసుకురాలేని పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఉందని కర్నూలు మేయర్ రామయ్య విమర్శించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో కేసులు బనాయించడం తప్ప రాష్ట్రప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని విధాలా మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విధిరాత.. మృత్యు గీత

- పిడుగు పాటుతో యువకుడి మృతి
- ఈరన్న భార్య సరస్వతికి నేడు ప్రసవం



గొల్ల ఈరన్న (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: తెల్లారితే తన రక్తాన్ని పంచుకుని పుట్టే శిశువును ఆ యువకుడు చూడాల్సి ఉంది. అయితే విధి పగపట్టింది. పసికందును చూడకుండానే పిడుగు రూపంలో మృత్యు ఒడికి చేర్చింది. ఈ దుర్ఘటన ఆదివారం రాత్రి ఎమ్మిగనూరు మండలం గుడేకల్ కొండపై చోటుచేసుకుంది. పెద్దకడుబూరు మండలం హనుమాపురం గ్రామానికి చెందిన గొల్ల ఈరన్న(25) ఎమ్మిగనూరు యాక్సిస్ బ్యాంక్‌లో బంగారు నగలపై తీసుకున్న రుణాలు రికవరీ చేసే ఉద్యోగం చేస్తున్నాడు. ఈ యువకుడు అదే గ్రామానికి చెందిన గొల్ల సరస్వతిని పెళ్లి చేసుకున్నాడు. సరస్వతి నేడు (సోమవారం) ప్రసవం అవుతుందని వైద్యులు చెప్పారు. గొల్ల ఈరన్న తల్లి లక్ష్మీకి అనారోగ్యంగా ఉండటంతో గుడేకల్ కొండపై ఉండే సుంకాలమ్మకు మొక్కు తీర్చుకుంటే తగ్గుతుందని పెద్దలు చెప్పారు. దీంతో ఆదివారం సాయంత్రం గొల్ల ఈరన్న, అతని స్నేహితులు, బంధువులైన సహదేవుడు, ఈరన్న, రామాంజనేయులు కలసి కొండపై శ్రీ సుంకాలమ్మ గుడి దగ్గరకు వెళ్లారు. మొక్కుబడి తీర్చుకొని అక్కడే వంట చేసుకొని భోజనం చేశారు. ఆకస్మాత్తుగా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు రావడంతో చెట్టు కిందకు నలుగురు వెళ్లారు. చెట్టు కింద కూర్చున్న గొల్ల ఈరన్నపై పిడుగు పడటంతో అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయాడు. పక్కనే ఉన్న సహదేవుడు, ఈరన్న, రామాంజనేయులకు స్వల్ప గాయాలయ్యాయి. గ్రామంలో ఉన్న బంధువులకు సమాచారం అందించటంతో అక్కడికి వచ్చి గొల్ల ఈరన్నతో పాటు మరో ముగ్గురిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే గొల్ల ఈరన్న(25) మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తన భార్య సరస్వతికి సోమవారం ప్రసవం ఉందని బంధువుల దగ్గర గొల్ల ఈరన్న చెప్పారు. భార్య ఒకరికి ప్రాణం పోసేలోపే భర్త ప్రాణం పిడుగు రూపంలో తీసుకుపోవటంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. రూరల్ ఏఎస్ఐ రామేశ్వరావు, కానిస్టేబుల్ బి.గోపాల్ ప్రభుత్వాసుపత్రికి వచ్చి ప్రమాదం జరిగిన తీరును మృతుడి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు చెప్పారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ



కోడుమూరు రూరల్: వెల్దుర్తి నుంచి కోడుమూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు, కోడుమూరు నుంచి వెల్దుర్తి వైపు వెళుతున్న లారీ వెంకటగిరి గ్రామ సమీపాన ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్‌కు రక్త గాయాలవ్వగా, బస్సులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో కేవలం 15 మంది ప్రయాణికులు మాత్రమే ఉన్నారు. సింగల్ రోడ్డులో ఆర్టీసీ బస్సు, లారీ డ్రైవర్ ఇద్దరూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని ప్రయాణికులు తెలిపారు.

రైలు పట్టాలపై వృద్ధుడి మృతదేహం

నంద్యాల: పట్టణంలోని గురురాజ పబ్లిక్ పాఠశాల సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద ఆదివారం గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు రైల్వే ఎస్‌ఐ జలీల్ తెలిపారు. వృద్ధుడి వయస్సు 70 సంవత్సరాలు ఉంటుందని, మృతుడు ఎరుపు రంగు పంచ, పచ్చరంగు చొక్కా ధరించి ఉన్నాడన్నారు. వృద్ధుడు మృతి చెంది నాలుగు రోజులు కావస్తున్నట్లు తెలుస్తోందన్నారు. మృతదేహానికి నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వైన్‌షాప్ సమీపంలో వ్యక్తి మృతి



మృతుడు కురవ అడివప్ప

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని అగ్నిమాపక కేంద్రం ఎదురుగా ఉన్న వైన్ షాప్ సమీపంలో ఆదివారం రాత్రి కురవ అడివప్ప(58) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు..పెద్దకడుబూరు మండలం హెచ్.మురవణి గ్రామానికి చెందిన కురవ అడివప్ప(58) ఉదయం ఎమ్మిగనూరుకు వచ్చాడు. ఫైర్ స్టేషన్ ఎదురుగా వున్న వైన్ షాప్‌కు సమీపంలోని కూల్‌డ్రింక్ షాప్ పక్కన కూర్చొని ఉన్నాడు. వర్షం ప్రారంభం కావటంతో అక్కడ ఉన్న వారు తలదాచుకునేందుకు వైన్‌షాప్ దగ్గరకు పరుగులు తీశారు. వర్షం తగ్గాక వచ్చి చూడగా కూల్‌డ్రింక్ షాప్ దగ్గర కూర్చున్న కురవ అడివప్ప స్పృహతప్పి పడిపోయి ఉండటంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. అడివప్ప మృతికి కారణాలపై విచారిస్తున్నామని ఎమ్మిగనూరు రూరల్ పోలీసుల తెలిపారు.

వాగులో పడ్డ ఆటో

పాణ్యం: మండల పరిధిలోని అనుపూరు గ్రామం వద్ద ఉన్న కొర్రవాగులో ఓ ఆటో పడి ప్రయాణికులకు గాయాలయ్యాయి. నంద్యాల నుంచి కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. దీంతో ఆటోలో ఉన్న ముగ్గురికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది. కాగా ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా దెబ్బతినింది.

ఎట్టకేలకు డీఎస్సీ!

- ఉమ్మడి జిల్లాలో 2,645 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- ఎస్‌జీటీ 1,817, స్కూల్ అసిస్టెంట్లు 828, ట్రైబల్ వెల్ఫేర్‌లో 33 పోస్టులు
- డీఎస్సీలో చూపించని స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు
- నెల రోజుల పాటు ఆన్‌లైన్‌లో పరీక్షలపై మండిపడుతున్న నిరుద్యోగులు



కర్నూలు సిటీ: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని ఆగస్టు నెలలో హడావుడి చేసింది. టెట్ పరీక్షల పేరుతో నాడు డీఎస్సీ నోటిఫికేషన్ వాయిదా వేసి, టెట్ నిర్వహించి ఫలితాలను సైతం విడుదల చేశారు. అదిగో...ఇదిగో అంటూ నాలుగైదు నెలలుగా నిరుద్యోగులను ఊరించి..ఊరించి ఎట్టకేలకు డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఏడాదికిపైగా నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారు. కొంత మంది విద్యార్థులు మనస్తాపానికి గురై అనారోగ్యాల బారిన పడ్డారు.

ఇదీ నిజం

- వాస్తవానికి 2018లోనే 1,393 టీచర్ పోస్టులు, 192 క్రాఫ్ట్ టీచర్ పోస్టులను రద్దు చేసి అప్పటి డీఈఓ వాటిని డీఎస్సీలో నోటిపై చేయాలని నాటి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం నామమాత్రంగా 608 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చింది.
- 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పోస్టులను భర్తీ చేసింది. అదే విధంగా 1998 డీఎస్సీ బాధితులకు, 2008 డీఎస్సీలో ఎంపికై ఉద్యోగాలు రాని వారికి సైతం టీచర్ పోస్టులు ఇచ్చింది.
- గతేడాది జిల్లాలో సుమారు 1,693 టీచర్ పోస్టుల భర్తీకి అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే టీడీపీ నేతలు న్యాయస్థానాల్లో కేసులు వేయించారు. దీంతో నిరుద్యోగులు మరో ఏడాది పాటు డీఎస్సీ కోసం వేచి చూడాల్సిన పరిస్థితులు వచ్చాయి.
- స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు ఉన్నప్పటికీ ప్రస్తుత డీఎస్సీలో ఒక్క పోస్టు కూడా చూపలేదు.
- పరీక్షలను ఆన్‌లైన్‌లో నెల రోజుల పాటు నిర్వహిస్తుండడంపై నిరుద్యోగులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- ఒకే నోటిఫికేషన్, ఒకే ప్రశ్నపత్రం ద్వారా పరీక్షలను ఆఫ్‌లైన్లో నిర్వహించాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.
- గతేడాది ఆగస్టు నెలలో నిర్వహించిన టెట్‌లో తక్కువ మంది అర్హత పొందారు. మిగిలిన వారికి కూడా అర్హత పొందేందుకు మరోసారి టెట్ నిర్వహించి..ఫలితాలు వచ్చిన వెంటనే నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. అయితే అందుకు విరుద్ధంగా చేశారు.

అవసరం ఇదీ..

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,843 స్కూళ్లు ఉన్నాయి. వీటిలో చదవుతున్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా 4,000 టీచర్ పోస్టులు అవసరం అని గతంలో జిల్లా విద్యాశాఖ అధికారులు నివేదికలు ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం 2,645 పోస్టులను భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది.
- ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధన చేసే స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు 'టెట్' నిర్వహించినా డీఎస్సీలో ఒక్క పోస్టును కూడా చూపలేదు. పోస్టులు భర్తీ చేయనప్పుడు ఎందుకు టెట్ నిర్వహించారని ప్రశ్నిస్తూ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.
- మున్సిపల్ స్కూళ్లలో అన్ని క్యాటగిరీలకు చెందిన 98 పోస్టులను భర్తీ చేయనున్నారు. మున్సిపల్ టీచర్లకు పదోన్నతులు ఇవ్వలేక 22 పోస్టులు మాత్రమే ఇచ్చారు.
- ప్రస్తుతం విద్యాశాఖలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన క్లస్టర్, మోడల్ ప్రైమరీ స్కూల్ విధానంతో ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఇంకా 1,300 టీచర్ పోస్టులకు పైగా అవసరమని విద్యాశాఖ అధికారులు గుర్తించారు.

పోస్టుల భర్తీ ఇలా..

డీఎస్సీతో ఉమ్మడి జిల్లాలో ఎస్‌జీటీ 1817, స్కూల్ అసిసెంట్లు లాంగ్వేజ్-182 పోస్టులు, హిందీ 114, ఇంగ్లిషు 81, గణితం 90, ఫిజికల్ సైన్స్ 66, బయోలాజికల్ సైన్స్ 74, సోషల్ స్టడీస్ 112, ఫిజికల్ ఎడ్యుకేషన్ 209 పోస్టులు భర్తీ చేయనున్నారు. వీటితో పాటు ఏపీ మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, గురుకులాల్లో జోన్-4లో ఉమ్మడి జిల్లాలో సుమారు 121 పోస్టులు భర్తీ చేయనున్నారు.

వైఎస్సార్‌సీపీ చొరవతోనే...

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా పశ్చిమ ప్రాంతంలోని పేద విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు పోస్టులు మంజూరైనా వారికి అవసరం లేని వాటిని ఉమ్మడి కర్నూలు జిల్లాకు బదలాయించారు. దీంతో సుమారు 1,845 పోస్టులకు జిల్లాకు వచ్చాయి. ఆ పోస్టుల్లో పనిచేస్తున్న వారికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇచ్చారు. దీంతో ఎస్‌జీటీ పోస్టులను నేటి డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు అవకాశం కలిగింది.

కంబోడియాలో కైలాస్‌రెడ్డి ప్రతిభ

- ఆసియా పారాత్రోబాల్ పోటీల్లో రజత పతకం



రజత పతకంతో కైలాస్‌రెడ్డి

కొలిమిగుండ్ల: మలేషియాలోని కంబోడియాలో జరిగిన దివ్యాంగుల పారాత్రోబాల్ పోటీల్లో కొలిమిగుండ్లకు చెందిన గండా కైలాస్‌రెడ్డి ప్రతిభ చాటాడు. రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఇటీవలే కంబోడియాలో ఆసియా ఖండంలోని ఎనిమిది దేశాలకు చెందిన జట్లు ఆసియా పారాత్రోబాల్ పోటీల్లో పాల్గొన్నాయి. ఈపోటీల్లో భారత జట్టు రజత పతకం సాధించినట్లు నిర్వాహకులు ఆదివారం ప్రకటించారు. పారా క్రికెట్‌లో ఆంధ్ర జట్టు కెప్టెన్‌గా వ్యవహరించిన కైలాస్‌రెడ్డి.. జాతీయ స్థాయి పారాత్రోబాల్ పోటీల్లోను మంచి ప్రతిభ కనపర్చి భారత జట్టు రజత పతకం సాధించేందుకు దోహదపడ్డాడు. రజత పతకం కోసం భారత్, మలేషియా జట్లు పోటీ పడ్డాయి. కైలాస్‌రెడ్డి విజయవాడలోని గనులు, భూగర్భ శాఖలో అవుట్ సోర్స్ కింద టైపిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆసియా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అండగా నిలిచిన సహచర ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాజ్యాంగానికి మోదీ తూట్లు



ర్యాలీలో వివిధ సంఘాల నాయకులు

- నూతన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం
- నిరసన ర్యాలీలో ముస్లింలు



ర్యాలీ చేస్తున్న ముస్లింలు

డోన్ టౌన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని పలువురు వక్తలు విమర్శించారు. నూతన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆదివారం డోన్ పట్టణంలో ముస్లింలు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న ఖబరస్తాన్ ఈద్గా నుంచి బేతంచెర్ల సర్కిల్, రైల్వే గేట్లు, పాత బస్టాండ్, స్టేట్ బ్యాంక్, కొత్త బస్టాండ్ తదితర ప్రాంతాల మీదుగా ఈ ర్యాలీ సాగింది. జాతీయ జెండాలు, నల్ల జెండాలు చేతబట్టి వక్ఫ్ సంరక్షణ, రాజ్యాంగ పరి రక్షణ అంటూ ముస్లింలు అధిక సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు ర్యాలీకి మద్దతు పలికారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పలువురు ముస్లిం మత పెద్దలు, సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని ప్రజల మధ్య చిచ్చు పెట్టేలా పరిపాలన సాగిస్తోందని విమర్శించారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు అంతా అన్యాయమన్నారు. ఈ బిల్లుతో ముస్లింలకు ఎలాంటి ప్రయోజనం లేదని, మరింత నష్టం కల్గించే విధంగా ఉందన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను కబ్జా చేసి పెట్టుబడి దారులకు కట్టబెట్టేందుకే కేంద్రం ఈ చట్టాని రూపొందించిందన్నారు. ఏపీ, బిహార్ సీఎంలు చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ మద్దతుతో కేంద్ర ప్రభుత్వం దేశాన్ని విచ్ఛిన్నం చేస్తుందన్నారు. నూతన వక్ఫ్ బోర్డు చట్టాన్ని వెంటనే రద్దు చేయక పోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

రాజకీయ కక్షతోనే ఎంపీ మిథున్ రెడ్డిపై తప్పుడు కేసులు



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): రాజకీయ కక్షతోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టారని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ ఆరోపించారు. ఆదివారం స్థానిక సి. క్యాంపులోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మిథున్‌రెడ్డి కుటుంబంపై అనేక నిరాధార ఆరోపణలు చేస్తున్నారని వెల్లడించారు. ఆధికార అండతో ప్రతి అంశంపై ఆరోపణలు చేస్తున్నారు తప్పా.. అందులో ఏ ఒక్కటి నిజం లేదని ఇప్పటికే ప్రజలకు అర్థమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కక్ష పూరిత రాజకీయాలు చేస్తుందని మండిపడ్డారు. ఇప్పటికైన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధించడం మాని ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృత్యువాత



మృతి చెందిన జోష్య హర్షిణిరెడ్డి



బోల్తా పడిన కారు



ప్రమాదస్థలంలో క్షతగాత్రులు

కొలిమిగుండ్ల: రాఘవరాజుపల్లె సమీపంలోని ప్రధాన రహదారిపై ఆదివారం కారు, బొలేరో జీపు ఢీకొన్న ప్రమాదంలో ఓ చిన్నారి మృతి చెందింది. మరో ఆరుగురు గాయపడ్డారు. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన చంద్రమోహన్‌రెడ్డి తన కూతురు జోష్యహర్షిణిరెడ్డి(6)ని నంద్యాలలోని మేనమామ ఇంట్లో ఉంచి చదివిస్తుండేవాడు. చంద్రమోహన్‌రెడ్డి అమ్మవారికి మొక్కుబడి చేసే కార్యక్రమం ఉండటంతో చిన్నారి జోష్యహర్షిణి రెడ్డి తాతయ్య రిటైర్డ్ టీచర్ రామసుబ్బారెడ్డితో పాటు బంధువులు వెంకటసుబ్బారెడ్డి, ఏటూరి శ్రీనివాస రెడ్డి, లక్ష్మీదేవిలను కారులో నంద్యాల నుంచి తీసుకొని బయలు దేరారు. సోమవారం పరీక్ష ఉందని తాను రానని చిన్నారి మారం చేసింది. అయితే కార్యక్రమం పూర్తి కాగానే రాత్రిలోగా ఇంటికి వస్తామని చెప్పడంతో ఒప్పుకొని వారితో పాటు బయలుదేరింది. రాఘవరాజుపల్లె శివార్లలోకి చేరుకోగానే అంకిరెడ్డిపల్లె నుంచి కొలిమిగుండ్లకు వస్తున్న బొలేరో వాహనం కారును వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో కారు ఎగిరి రోడ్డు పక్కన బోల్తా పడింది. కారులో ఉన్నవారంతా అందులో ఇరుక్కు పోవడంతో స్థానికులు అతికష్టంగా బయటకు తీశారు. బొలేరోలో ఉన్న అంకిరెడ్డిపల్లె యువకులు రాజకుళ్లాయి, బాలుకు గాయాలయ్యాయి. చిన్నారి జోష్య హర్షిణి కోమాలోకి వెళ్లిపోవడంతో చికిత్స కోసం అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మిగిలిన క్షతగాత్రులను 108లో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ రమేష్‌బాబు ప్రమాద స్థలానికి చేరుకొని వివరాలు ఆరా తీశారు. శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

భార్య, అత్తపై హత్యాయత్నం

- చెరుకులపాడు గ్రామంలో ఘటన

వెల్దుర్తి:చెరుకులపాడు గ్రామంలో ఓ వ్యక్తి భార్య, అత్తపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఒకరు తప్పించుకోగా..మరొకరికి కాలిన గాయాలయ్యాయి. శనివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఎస్‌ఐ అశోక్ తెలిపిన మేరకు.. చెరుకులపాడు ప్రమీలమ్మ కూతురు రామేశ్వరమ్మకు, కోడుమూరుకు చెందిన ఎర్రమలతో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. అయితే, భర్త వేధింపులు తాళలేక రామేశ్వరమ్మ ఆరునెలల క్రితం పుట్టింటికి చేరుకుని తల్లితో ఉంటోంది. శనివారం తల్లితో కలిసి కోడుమూరులో మనవడి శుభ కార్యానికి వెళ్లి వస్తుండగా ఎర్రమల వెంట పడి భార్యను కాపురానికి పంపాలని అత్తను వేధించసాగాడు. అమె స్పందించకపోవడంతో చెరుకులపాడుకు వచ్చాడు. రాత్రి కిరోసిన్ తీసుకుని అత్త ఇంటికి వెళ్లి తన భార్యను కాపురానికి పంపకపోతే ఇరువురిని చంపుతానని బెదిరించాడు. వినకపోవడంతో వారిపై కిరోసిన్ పోసి అంటించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో భార్య తప్పించుకోగా, అత్త ప్రమీలమ్మకు ఒళ్లు కాలింది. స్థానికులు క్షతగాత్రురాలును చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎర్రమలపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏపీటీఎస్‌ఏ ఉమ్మడి జిల్లా శాఖ ఎన్నికలు ఏకగ్రీవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్(ఏపీటీఎస్‌ఏ) ఉమ్మడి కర్నూలు జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. ఆదివారం బి.క్యాంపులోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారిగా నెల్లూరు జిల్లా ఏపీటీఎస్‌ఏ అధ్యక్షుడు పి.కిరణ్‌కుమార్ వ్యవహరించారు. ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి జిల్లా ట్రెజరీలో సీనియర్ అకౌంటెంటుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన చొరవ తీసుకోవడంతో పోటీ లేకుండా ఎన్నిక ఏకగ్రీవమైంది. ఏపీటీఎస్‌ఏ ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడుగా డి.రవికుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్.మహబూబ్‌బాషా, ఉపాధ్యక్షులుగా టి.వనిత, పి.సుధాకర్‌రెడ్డి, ఎస్.ఆంజాద్‌బాషా, రాకేష్, కార్యదర్శిగా టి.గురుమూర్తి, జాయింట్ సెక్రటరీలుగా కె.విజయమ్మ, జి.అరవింద్ హనోక్, ఆర్.లక్ష్మణ్ నాయక్, కోశాధికారిగా ఎన్.సునీల్‌బాబు. స్టేట్ కౌన్సిల్ మెంబర్లుగా ఉదయ్‌కుమార్, వేమచంద్రరావు, హెచ్‌ఎండీ అలియా ఎన్నికయ్యారు.

డాక్టర్ దగ్గరకు వెళ్లాల్సిందే!

- ప్రతి సారీ డాక్టర్ రాసిన తాజా ప్రిస్క్రిప్షన్ ఉండాల్సిందే
- ప్రిస్క్రిప్షన్ చూపకపోతే మందులు ఇవ్వని మెడికల్ షాపులు
- ఇస్తే నోటీసులు తప్పవంటున్న అధికారులు
- రూ.50 మాత్రలకు రూ.వెయ్యి దాకా ఖర్చు
- ప్రభుత్వ చర్యలతో రోగుల బెంబేలు



గరుడ ఆపరేషన్‌లో భాగంగా మందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): ఎవ్వరికైనా జ్వరం, జలుబు, దగ్గు, వాంతులు, విరేచనాలు వంటి సాధారణ జబ్బులు వస్తే చాలా మంది డాక్టర్ వద్దకంటే మెడికల్‌షాపులకు ముందుగా వెళ్తారు. అక్కడ వారికి వచ్చిన అనారోగ్య లక్షణాలు చెప్పి మందులు ఇవ్వాలని కోరతారు. ఈ మేరకు రెండు, మూడు రోజులకు సరిపడా మందులు ఇస్తే చాలా వరకు తగ్గిపోతుంది. దీనివల్ల డాక్టర్ వద్దకు వెళ్లే సమయం, ఖర్చు మిగిలిపోతుందని సామాన్యుని భావన. కానీ ఇకపై ఇలా నేరుగా మందుల దుకాణానికి వెళ్లి మందులు ఇవ్వాలని కోరితే కుదరదు. అలా ఏవి పడితే ఆ మందులు ఇవ్వొద్దని మందుల దుకాణదారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. యాంటిబయాటిక్స్‌తో పాటు నిద్ర, ఆందోళన, డిప్రెషన్ మందులు వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా ఇస్తే లైసెన్స్ రద్దు చేస్తామని చెబుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 3,100 దాకా రిటైల్ మెడికల్ షాపులు, 500 దాకా హోల్‌సేల్ మెడికల్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి నెలా రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు వ్యాపారం నిర్వహిస్తున్నారు. కర్నూలు, ఆదోని, నంద్యాల డివిజన్‌లకు నలుగురు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరు ఒక్కొక్కరు ప్రతి నెలా 40 దుకాణాలు తనిఖీలు చేయాల్సి ఉంది. ముఖ్యంగా దుకాణంలో ఫార్మాసిస్టు ఉన్నారా, మందుల కొనుగోలు, అమ్మకాల వివరాలు, కొనుగోలుదారులకు బిల్లు ఇస్తున్నారా, వైద్యుల ప్రిస్కిప్షన్ ఆధారంగా మందులు ఇస్తున్నారా, గడువు తీరిన, గడువు ఉన్న మందులు విక్రయిస్తున్నారా, నిషేధిత మందులను అమ్ముతున్నారా, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా అనే అంశాలను పరిశీలించి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. వారు ఇచ్చిన నివేదికల ఆధారంగా ఏడీ స్థాయి అధికారులు సదరు దుకాణాలపై చర్యలు తీసుకుంటారు.

ఇటీవల దాడులతో కంగారు..

ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కలిసి జిల్లా వ్యాప్తంగా మందుల దుకాణాలపై దాడులు నిర్వహించారు. పలు దుకాణాల్లో యాంటిబయాటిక్స్, నిద్రమాత్రలు, మత్తును కలిగించే నొప్పి మాత్రలు, ఆందోళన, డిప్రెషన్ మందులు వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు పలువురికి ముందుగా నోటీసులు ఇచ్చి వారు ఇచ్చిన సంజాయిషీ ఆధారంగా వారం రోజుల పాటు సస్పెన్షన్ విధించారు. అప్పటి నుంచి వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా యాంటిబయాటిక్స్, మత్తును కలిగించే మాత్రలు విక్రయించేందుకు దుకాణదారులు వెనుకడుగు వేస్తున్నారు. తాజాగా వైద్యులు రాసిచ్చిన చీటిని తెస్తేనే మందులు ఇస్తామని తెగేసి చెబుతున్నారు.

డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా విక్రయించడం నేరం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల గరుడ ఆపరేషన్ పేరుతో నార్కొటిక్ డ్రగ్స్ అమ్మకాలపై నిఘా ఉంచాం. ఈ మేరకు పలు దుకాణాలపై దాడులు నిర్వహించి చర్యలు తీసుకున్నాము. హెచ్‌వన్ రిజిస్టర్‌లో ఉన్న యాంటిబయాటిక్స్, యాంటి టీబీ, మత్తుకలిగించే మందులు డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా విక్రయించకూడదు. నిద్ర, ఆందోళన, డిప్రెషన్ మందులు రెగ్యులర్‌గా వాడుతున్న వారు డాక్టర్ రాసిన చీటిని తీసుకొచ్చి మందుల దుకాణాల్లో చూపిస్తే దానిపై సదరు దుకాణదారుడు ఇచ్చిన మందుల సంఖ్య, తేదిని రాసి సీలు వేస్తారు. దీనివల్ల నిర్ణీత సమయంలో తిరిగి అంతకుమించి మందులు వాడకుండా నియంత్రించబడుతుంది.

– వి. వీరశేఖర్, డిప్యూటీ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ

వృద్ధులు, రోగులు నరకయాతన

నార్కోటిక్ డ్రగ్స్‌ను డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులతో ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఇటీవల నిర్వహించిన దాడులతో మెడికల్‌షాపుల వారు విక్రయాలు నిలిపివేశారు. డాక్టర్ తాజాగా రాసిచ్చిన చీటి తెస్తేనే మందులు ఇస్తామని చెప్పి వెనక్కి పంపిస్తున్నారు. దీంతో కొంత కాలంగా ఆయా మందులకు అలవాటుపడిన వారు మాత్రలు లభించక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మానసిక సమస్యలతో బాధపడుతూ వైద్యుల సూచన మేరకు కొంత కాలంగా మందులు వాడేవారు, గుండె, ఇతర ఆరోగ్య సమస్యలతో నిద్రకరువై వైద్యుల సూచన మేరకు నిద్రమాత్రలు, ఆందోళన, డిప్రెషన్ తగ్గించే మాత్రలు వాడే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎవరో దురలవాట్లకు బానిసలై ఇలాంటి మందులు కొంటే రెగ్యులర్‌గా వాడే మాలాంటి వారిని ఇబ్బందులకు గురిచేస్తే ఎలాగని వారు ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల ప్రతి ఒక్కరూ నిద్ర రాక, ఆందోళన, డిప్రెషన్ పెరిగి మరింత అనారోగ్యం కొని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన చెందుతున్నారు.

రూ.50ల మాత్రలకు రూ.వెయ్యి దాకా ఖర్చు

ఇప్పటి వరకు ఆయా ఆరోగ్య సమస్యలతో బాధపడే వారు వైద్యుల సూచనలతో మత్తు కలిగించే మందులు వాడుతూ వస్తున్నారు. ఒకసారి డాక్టర్ వద్ద చూపించుకుని నెలల తరబడి అవే మందులను మెడికల్‌షాపుల్లో కొనుగోలు చేసి వాడుతున్న వారు ఉన్నారు. చాలా చోట్ల తాజాగా వైద్యులు రాసిచ్చిన చీటి ఆధారంగానే ఇలాంటి మందులు ఇస్తారు. కానీ పరిచయం ఉన్న కారణంగా కొందరు వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండానే మందులు ఇచ్చేస్తున్నారు. దీనికితోడు ప్రతిసారీ డాక్టర్ వద్దకు వెళ్లాలంటే ప్రయాణ చార్జీలు, సమయం, డాక్టర్ ఫీజు కలిపి రూ.500ల నుంచి రూ.1000ల దాకా అవుతోంది. అదే నేరుగా మెడికల్‌షాపులకు వెళ్లి గతంలో రాసిన మందులు కొంటే రూ.50ల నుంచి రూ.100లతో పని పూర్తవుతుంది. తాజా నిబంధనల వల్ల ఆర్థిక భారం అధికమవుతోందని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.